## శ్రీకోమఱ్ఱాజు లక్ష్మణరావుగారు.

శ్రీ లక్ష్మణరావుగారు, నిర్యాణముచేందిరని వాఙ్మయ పత్రికా పాఠకులకు మిక్కిలి దుఃఖముతో తెలుపుచున్నాము. విరామములేని కార్యభారముల మధ్యమున, వాఙ్మయపత్రికకు న్యాయదర్శనమును ఆంధ్రీకరించి యిచ్చుచుండిరి. శాస్త్ర వాఙ్మయసభ అనేపేరుతో ఒక సంఘమును నెలకొల్పవలెనని ప్రయత్నించిన సమయమున, ఆహ్వానపత్రమున చేవ్రాలు వ్రాసిన వారిలో శ్రీకోమఱ్ఱాజు లక్ష్మణరావు పంతులుగారొకరు. అట్టి వారిలో ఒకరగు శ్రీమహామహోపాధ్యాయ వేదం వేంకటరాయశాస్త్రిగారు వృద్ధులగుటచే సంఘోద్దిష్ట కార్యనిర్వహణమునందు జోక్యము కలిగించుకొనక విరమించిరి. శాస్త్ర వాఙ్మయసభ ప్రతిష్ఠితముకాక, తదుద్దిష్ట కార్యమును వాఙ్మయపత్రిక నిర్వహించ మొదలుపెట్టినప్పటినుండి శ్రీలక్ష్మణరావు పంతులుగారు దీక్షతో పత్రికకు తోడ్పడుచు న్యాయదర్శనమును ఆంధ్రీకరించి యిచ్చుచువచ్చిరి. శ్రీలక్ష్మణరావుగారి నిర్యాణము వాఙ్మయపత్రికకు అపారమైన కొఱతను కలిగించినది. వీరి వైదుష్యము ఆంధ్రలోకమున ప్రసిద్ధమైనది గనుక మేము వివరించలేదు. ఈపురుషుని వియోగమువల్ల ఆంధ్రదేశమునకు కలిగిన కొఱత ఏనాటికి తీరునా అని విచారముతో ఈ సంతాపకరమైన వార్తనిక ముగించుచున్నాము.

మ న వి.

శ్రీలక్ష్మణరావుగారు ఆంధ్రీకరించిన గ్రంథము సుమారు ఇరవై పత్రములుమాత్రమేవున్నది. ఎప్పటికప్పుడు వ్రాసియిచ్చుచుండిరి గనుక దర్శనమును సమగ్రముగా ఆంధ్రీకరించి వుండలేదు. ఈ పనికి పూనుకొని వాఙ్మయపత్రికకు తోడ్పడవలెనని విద్వాంసులను వేడుచున్నాము.

# శ్రీ కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారిని గుఱించి నా స్మరణములు.

పొడుగుగాదు ; పొట్టిగాదు ; సాధారణ పరిమాణము ; పసిమిచాయ ; చిన్న పిలకజుట్టు ; వాలు మీసములు ; నిర్మలమైన దృక్కులు ; ఆ మనిషిని చూడగానే నీతిశాలియని అనుకొందుము. స్వశక్తి జ్ఞాతృత్వము, తదనుగుణమైన ఆత్మరతి ఇవిమాత్రమేకాదు. వీటిని హితోన్ముఖములుచేసి వీటికివన్నె తేగలిగిన వినయసంపద ఆయనయందు గోచరించుచుండును.

x x x x

శ్రీ లక్ష్మణరావుగారితో పదిసంవత్సరముల యెరుకకలదు. మొదట పరిచితుడై పిమ్మట ఆప్తుడై, అంతట శ్రేయః ప్రదాతయై, తరువాత వాఙ్మయపత్రికా ప్రారంభమున సహకారి ఆయెను. ఇన్నిదశలయందును అనుస్యూతముగా అనుభూతమైన శ్రీలక్ష్మణరావుగారి సౌజన్యము ఎన్నటికిని మరువరానిది.

x x x x

శ్రీ లక్ష్మణరావుగారు మహారాష్ట్రప్రియుడు. మరాఠీ విద్వాంసుల, మరాఠీ ప్రభువుల, మరాఠీ సంస్కర్తల, మరాఠీపత్రికల ప్రశంసలు శ్రీలక్ష్మణరావుగారు నాకు అనేకపర్యాయములు చెప్పుచుండేవారు. స్వదేశముకంటె విదేశమే యెక్కువగా వీరికి ప్రేమపాత్రమా అని సంశయిస్తూ వుండేవాడిని. కాని, వారు స్వదేశ స్వవాఙ్మయముల ప్రేమయందు దీక్షితులైనది మరాఠీదేశ నివాసమువల్ల అని నేను కనుగొన్ననాడు నాకు ఆసంశయము పోయెను.

x x x x

శాసనములనుగుఱించి నేను వాఙ్మయపత్రికలో వ్రాసిన అంశములు శ్రీ లక్ష్మణరావుగారికి సమ్మతములు కాలేదు. చూడబోయితిని. మీమీద కోపమువచ్చినది, ఇప్పుడు పోయినదన్నారు. రాగిరేకులనుండి రాతిచెక్కలనుండి మనదృష్టి జీవదాంధ్రలోకమునకు రావలసియున్నది అందుకే ఆవ్యాసము వ్రాసితినంటిని. తలావకపనిచేయడము ఉచితముగదా నేనీ పరిశోధన చేస్తున్నాను కానీయండి మీ వాఙ్మయ చర్చలలో రాగిరేకుల

రాతిచెక్కలజోలికి ఎంతవరకు రాకుండా వుంటారో చూస్తాను అనిరి. ఇద్దఱము నవ్వితిమి. ఆ చర్చ వదలితిమి.

x x x x

శ్రీ లక్షణరావుగారు నన్ను పూర్వాచార పరాయణునిగా భావించేవారు. పూర్వభారతవర్షమును ప్రేమించుటే నాపూర్వాచార పరాయణత్వమైతే ఆ పేరును నేను మిక్కిలి ప్రేమిస్తున్నానంటిని. ఆచార వ్యవహారములలో మార్పుకోరే మీరు పద్యవికారములను గద్య గ్రంథములలో ఉపయోగించడమనే దుష్ట పూర్వాచారమును మానజాలకున్నారంటిని. అయితే సల్లాపముకంటె దేశమునుగుఱించి, సంఘమునుగుఱించి, ఇతిహాసమునుగుఱించి, తీవ్రవాదములందే సమావేశములలో ఎక్కువకాలము గడచుచుండేది. చివరకు శాంతము వాద సమాపకమగుచుండేది.

x x x x

శ్రీ లక్ష్మణరావుగారికి జ్యోతిశ్శాస్త్రమునందు నమ్మిక లేదు. మదరాసు విశ్వ విద్యాలయమున మైసూరు విశ్వ విద్యాలయమున, పుస్తక నిర్ణయ సంఘములలో సభ్యత్వము వారికి వచ్చిన సందర్భమందు నాకీసంవత్సరము పుస్తక నిర్ణయగ్రహము ముందుకు వచ్చినదేమో నని ఒకనాడన్నారు.

x x x x

శ్రీ లక్ష్మణరావుగారికి స్వదేశ వాఙ్మయప్రేమ యెంత గాఢమైనదో నాకు చాలాకాలము తెలియలేదు. సంస్కృతము నందలి కాళిదాసాదుల గొప్ప కవిత్వమునుగుఱించి ఒకనాడు ప్రశంసించితిని. సంస్కృతములో ఎంత గొప్ప కవిత్వము ఉన్నదో తెలుగులోను అంత గొప్ప కవిత్వము ఉన్నదన్నారు. ఆమాట సత్యమైనా కాకున్నా మీ స్వదేశ వాఙ్మయప్రేమ అత్యంతము సత్యమైనదన్నాను. ఒకవిధమైన ధీరదృష్టినినాపై బరపిరి.

x x x x

శ్రీ లక్ష్మణరావుగారు ఒకనాడు ఆకస్మికముగా స్మృతి తప్పిరట. వైద్యసాహాయ్యము మొదలైనవి జరిగినతరువాత ఆనాడో మరునాడో చూడబోయితిని. వృత్తాంతము చెప్పిరి. అప్పటికీ ఒకరాగిశాసనము వారిచేతిలో వుండెను. ప్రాణము

పోవునేమోనని చాలా భయపడితినన్నారు. మెదడుతో బొత్తిగా పనిచేయలేని దశ వచ్చినదన్నారు. పనికి బుద్ధి యెదురుతిరుగుతున్నదన్నారు. నాకీదశ చాలాకాలముక్రిందనే అనుభూతమైనదన్నాను. అయితే మీరు నాస్థితిని బాగా ఊహించగలరన్నారు.

x x x x

విషజ్వరముచే బాధితుడనై కొంత స్వస్థత వచ్చినతరువాత ఒకనాడు జీవితముపై రోతను కనబఱచితిని. తరుణజను లట్లనగూడదని చెప్పిరి.

x x x x

శ్రీ లక్ష్మణరావుగారికీ నాకూ అనేక విషయములలో అభిప్రాయములు భిన్నములు; ధనవంతులు తదితరులను, సంస్కారవంతులు తద్భిన్నులను ఎట్లుచూచేది పరిశీలనచేయడమున శ్రీలక్ష్మణరావుగారికీ నాకూ చాలాపర్యాయములు అవకాశములు తటస్థించినవి. వారు ఆసందర్భమున ఒకనాడు నన్ను అధికరించి తమ అభిప్రాయములు వెలిబుచ్చిరి. నేనుమాత్రము తూష్ణీంభావముతో ఉంటిని. ఆవిషయమున నేనిప్పటికీ తూష్ణీంభావముతోనే ఉన్నాను.

x x x z

విజ్ఞాన సర్వస్వములో ఆంధ్రశబ్దమువద్ద ఆగి కృషికి ఆరంభించిరి. నైజాములో తెలంగానా అనే ప్రదేశము మొదటి తెలుగుదేశమనీ ఆపేరే తక్కినభాగములకు వ్యాపించినదనీ ఒకనాడన్నారు.

x x x x

విజ్ఞానచంద్రికప్రశంస రాగానే ఒకవిధమైన వికాసము పునర్నవత్వము పొందుతూ వుండేవారు. త్రికరణ శుద్ధిగల కృతార్థత్వమిట్టిదని అనుకొనేవాడిని.

x x x x

అనేక శతాబ్దుల పరాధీనతవల్ల, పరవాఙ్మయ నిరతత్వమువల్ల మనదృష్టి అభారతీయమై పోయినదంటిని. దానికి శ్రీలక్ష్మణరావుగారికి కొంత కోపమువచ్చెను. చివరకు మామూలు శాంతమునకు మరలినతరువాత మైసూరు గవునరుమెంటువారు కొత్తగా పంపిన సంస్కృత గ్రంథముల నన్నిటిని చూపిరి.

అనేక పుస్తకములభారము పార్శ్వముల, వెనుక, ఉండగా సాయంకాలముల శ్రీలక్ష్మణరావుగారు వసారాకు ఇవతల ఆరు బైట కూర్చుండేవారు. అది గ్రీష్మ సమయము. చెన్నపట్టణమున సయితము నివాసము దుస్సహముగావుండెను. సూర్యుని తాపము అప్పుడప్పుడే సమసినది. ఒకవిధమైన కావురు దిక్కులను ఆవరించి దిగజారు సూర్యుని కప్పివేయుచుండెను. శ్రీ లక్ష్మణరావుగారిముఖము వాడివుండెను. చక్షువులు ప్రయత్నముతో తేజస్సును పైకి తెచ్చుకొనుచుండెను. శ్రీ లక్ష్మణరావుగారు ఒక కుర్చీలో కూర్చుండిరి. కుశలప్రశ్నమైనతరువాత నేనీ సంవత్సరము మదనపల్లికి పోవలెననుకొంటున్నా నన్నారు. విశ్రాంతికొరకు పోతున్నాగాని, పుస్తకములులేనిది ఆ విశ్రాంతికే భంగముకలుగుతుందన్నారు. మీవద్ద సంస్కృతదశకుమారచరిత్ర వుంటే నాకియ్యండి అని అన్నారు. భారవి దేశకాలములనుగురించి సిద్ధాంతములు మారినవనీ, అవంతిసుందరీకథ అనే కొత్తపుస్తకమొకటి దొరకినదనీ చెప్పినాను. దానిని శ్రీమానవల్లి రామకృష్ణకవిగారిదివరకే నాకు చూపినారంటిని. నిర్జీవమైన కాలచర్చల నుండి చాలాకాలముక్రిందటనే నివృత్తుడనైన నేను ఆసంభాషణమునకు విముఖత్వము కనబఱచితిని. పిమ్మట భోజుని శృంగారప్రకాశమును గుఱించి ఒకటిరెండు మాటలు మాట్లాడితిమి.

x x x x

శ్రీ లక్ష్మణరావుగారు పల్నాటివీరుల కథలు కావలెనని వుత్తరము వ్రాసిరి. పోయిచూచి మాట్లాడవలెననుకొంటిని. శ్రీ వెంకటరమణయ్యగారు వచ్చి వృత్తాంతము ఖండవాక్యములలో తెల్పిరి. వెడచూపు చూచితిని. తెలుగుదేశపు ఒక గొప్ప ఐతిహాసికుడు, ఒక గొప్ప విద్వాంసుడు; ఒక గొప్ప వాఙ్మయతత్పరుడు, ఆంధ్రదేశ గర్భమునుండి వెడలిన ఒక మహాపురుషుడు నేడు అస్తమించెనా అని సంతాపపడితిని. ఆ రాత్రి నాలుగు గంటలవేళ ఆంధ్రదేశపు దురదృష్టమునకు దుర్నివారముగ కంట నీరువచ్చెను.

అక్కిరాజు ఉమాకాన్తమ్.

---

*C. M. & Sons, Lingha Chetty Street, Madras.*